సాక్షి
పశ్చిమగోదావరి

మంగళవారం । 31 । జనవరి । 2023



సోమేశ్వరస్వామికి పూజలు

భీమవరం(ప్రకాశం చౌక్): ఉమా సోమేశ్వర జనార్ధన స్వామిని స్కిల్ డెవల్‌మెంట్ కార్పొరేషన్ ఎండీ ఎస్.సత్యనారాయణ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.



వీవీప్యాట్ గోదాం పరిశీలన

ఏలూరు(మెట్రో): కలెక్టరేట్ వద్ద ఉన్న ఈవీఎం, వీవీప్యాట్ గోదాంను సోమవారం కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు. వాటి రక్షణ, భద్రతను తనిఖీ చేశారు.



స్వామివారికి చక్రస్నానం

పాలకొల్లు సెంట్రల్: సీతారామలక్ష్మణ ఆలయంలో కల్యాణోత్సవంలో భాగంగా స్వామివారిని క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయానికి తీసుకొచ్చి చక్రస్నానం చేయించారు.

న్యూస్‌రీల్

కలెక్టరేట్‌లో గాంధీజీకి నివాళులు



గాంధీజీకి నివాళి అర్పిస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): భీమవరం కలెక్టరేట్‌లో సోమవారం జాతిపిత గాంధీజీ వర్ధంతిని నిర్వహించారు. కలెక్టరేట్ ప్రాంగణంలో ఉన్న గాంధీజీ విగ్రహానికి కలెక్టర్ ప్రశాంతి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గాంధీజీ మార్గంలో అందరు పయనించాలన్నారు. ముఖ్యంగా యువత ఆయనను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. సత్యం, అహింస మార్గాలను ఆయుధంగా చేసుకొని స్వాతంత్య్రం కోసం పోరాడారన్నారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు భద్రతపై చిత్రలేఖన పోటీలు

భీమవరం(ప్రకాశం చౌక్): రోడ్డు భద్రతా వారోత్సవాల్ని పురస్కరించుకొని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 1న 11 గంటలకు జిల్లా ప్రజా రవాణా అధికారి కార్యాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రజా రవాణా అధికారి ఏ.వీరయ్య చౌదరి తెలిపారు. విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడం ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు. 6 తరగతి నుంచి 10 తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు ఈ వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలలో పాల్గొనవచ్చని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొని ప్రతిభ కనబరిచిన వారికి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు పోటీలో పాల్గొన్న 20 మంది వరకు రోడ్డు భద్రత వారోత్సవాల చివరి రోజు ఫిబ్రవరి 2న బహుమతులు అందజేస్తారన్నారు.

జాతీయ కుష్టు నివారణ పక్షోత్సవాలు



కుష్టు నివారణ పక్షోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

భీమవరం(ప్రకాశం చౌక్): జాతీయ కుష్టు వ్యాధి నివారణ పక్షోత్సవాలు కలెక్టరేట్‌లో జిల్లా వైద్యశాఖ అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. డీఎంహెచ్‌ఓ ఉమామహేశ్వరరావు కార్యక్రమం ప్రారంభించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు స్వచ్ఛంద సంస్థలతో కలిసి ఈ పక్షోత్సవాలు నిర్వహిస్తామని అన్నారు. శ్రీ విజ్ఞాన వేదిక కన్వీనర్ చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ కుష్టువ్యాధి సోకినవారిని సమాజం ఆదరించాలని అన్నారు. ప్రచార భేరి కార్యక్రమాల్లో భాగంగా సెయింట్ మేరీస్ సెంటర్ శ్రీవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా వైద్య శాఖ అధికారుల సహకారంతో కళాశాలలో వివిధ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. అదనపు వైద్యాధికారి డాక్టర్ భాను నాయక్, సెయింట్ మేరీస్ సెంటర్ డైరెక్టర్ సెల్విన్, సిస్టర్ అల్విరా, ఏవో పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.

పాజిటివ్ పీపుల్స్ సొసైటీ కార్యవర్గం ఎన్నిక



పాజిటివ్ పీపుల్స్ సొసైటీ జిల్లా కార్యవర్గం

భీమవరం(ప్రకాశం చౌక్): హెచ్ఐవీ బాధితులకు సేవలు అందించడానికి, వారి హక్కుల పోరాటానికి వారికి ఆర్థిక సహాయం అందించడానికి పశ్చిమగోదావరి జిల్లా పాజిటివ్ పీపుల్స్ సొసైటీ జిల్లా నూతన కార్యవర్గం సోమవారం ఎన్నికైంది. భీమవరంలో పాజిటివ్ పీపుల్స్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు టి.రామ్మోహనరావు సమక్షంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఎ.భాస్కరరావు, సెక్రటరీగా కముజు శ్రీనివాసరావు, వైస్ ప్రెసిడెంట్‌గా ఎల్.రామకృష్ణ, ట్రెజరర్‌గా పి.శేషారత్నంను ఎన్నుకున్నారు.

నైపుణ్యంతోనే ఉపాధి అవకాశాలు

ఉండి: ప్రతి ఒక్కరూ వృత్తి నైపుణ్యాన్ని పెంపొందించుకున్నప్పుడే ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభిస్తాయని కలెక్టర్ పీ.ప్రశాంతి అన్నారు. సోమవారం ఉండి మండలం ఎన్నార్పీ అగ్రహారంలోని ఐటీఐలో స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా డైకిన్ కంపెనీ ల్యాబ్‌ను ఆమె ప్రారంభించారు. డైకిన్ ద్వారా ఉచిత శిక్షణ అందించి ఉద్యోగావకాశాలు కల్పిస్తామని నిర్వాహకులు చెప్పారు.

డెల్టా కూత వినిపించేనా?

- ఆధునికీకరణ సరే.. అవస్థలు తీరేదెప్పుడు!
- అటకెక్కిన నర్సాపురం–విజయవాడ కొత్త రైళ్లు
- ఇప్పటికీ మోక్షం లేని నర్సాపురం–కోటిపల్లి లైన్
- ఈ సారి రైల్వే బడ్జెట్‌పై డెల్టా వాసుల ఆశలు



ఆకివీడు: ప్రతి సారి రైల్వే బడ్జెట్‌లో డెల్టా వాసుల ఆశలపై నీళ్లు చల్లుతూనే ఉన్నారు. ఈ సారి బడ్జెట్‌లోనైనా డెల్టా వాసుల రైల్వే డిమాండ్ల నెరవేరుతాయని ఈ ప్రాంత వాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు. డబ్లింగ్, విద్యుదీకరణ పూర్తయినా.. కొత్త ఎక్స్‌ప్రెస్‌ల జాడ లేకపోవడంతో ప్రయాణికులకు నిరాశ మిగిలింది. డబ్లింగ్ పూర్తయితే రైళ్లు సకాలంలో తిరుగుతాయని, కొత్త రైళ్లు వస్తాయని ప్రయాణికులు ఆశించారు. అయినప్పటికీ రైళ్ల రాకపోకలు నిదానంగానే సాగుతున్నాయి. క్రాసింగ్‌లు లేకపోయినప్పటికీ ఈ ప్రాంతంలో నడుస్తున్న రైళ్లలో సగం రైళ్లు ఆలస్యంగానే నడుస్తున్నాయి. నిడదవోలు–నర్సాపురం, నర్సాపురం–భీమవరం–గుడివాడ–విజయవాడల మీదుగా ఎప్పటిలాగానే సర్కార్, శేషాద్రి, సింహాద్రి, విశాఖ, కోకొనాడ, ఎల్‌టీటీ, పూరి–తిరుపతి, నర్సాపూర్, నాగర్‌సోల్, నర్సాపుం- ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌లు నడుస్తున్నాయి. ఎలాంటి కొత్త ఎక్స్‌ప్రెస్‌లు, ప్యాసింజర్‌లు ప్రారంభించలేదు.

హామీలన్నీ గాలిమాటలే..

నర్సాపురం నుంచి విజయవాడ వైపు, వైజాగ్ వైపు నడిచేందుకు కొన్ని రైళ్లకు గతంలో రైల్వే ఉన్నతాధికారులు హామీ ఇచ్చినా అమలుకు నోచుకోలేదు. నడుస్తున్న కొన్ని రైళ్లను రద్దు చేశారు. డెల్టా ప్రాంతం పారిశ్రామిక, వ్యాపార, వ్యవసాయ, ఆక్వా రంగాలతో నిరంతరం అభివృద్ధి చెందుతుంది. దక్షిణ మధ్య రైల్వేకు రవాణా మార్గం ద్వారా అత్యధిక ఆదాయం ఈ ప్రాంతం నుంచి వస్తుంది. డెల్టా ప్రాంతానికి ఆధునిక రైల్వే మార్గాలు కల్పించినా.. కొత్త రైళ్లను వేయకపోవడంతో ఈ ప్రాంత ప్రజలు, ప్రయాణికులు నిరుత్సాహంతో ఉన్నారు. నర్సాపురం–వైజాగ్‌కు ఎక్స్‌ప్రెస్ నడపాలనే ప్రజల కోరిక నేటికీ నెరవేరలేదు. ఈ ఎక్స్‌ప్రెస్ వల్ల డెల్టా ప్రాంతంతో పాటు కోనసీమ జిల్లాలోని సగం ప్రాంతం ప్రజలకు వైజాగ్ వెళ్లేందుకు మార్గం సుగమం అవుతుంది. ఈ ప్రాంత ప్రజలు రాజమండ్రి వెళ్లి వైజాగ్‌కు రైలు ప్రయాణం చేయాల్సి వస్తుంది. నర్సాపురం–యశ్వంత్‌పూర్(బెంగుళూరు) ఎక్స్‌ప్రెస్‌ను రెండు నెలలు నడిపి నిలిపివేశారు. నర్సాపురం–వారణాసి ఎక్స్‌ప్రెస్ నడపాలని రైల్వే శాఖ గతంలో నిర్ణయించింది. విజయవాడ–సికింద్రాబాద్‌ల మధ్య నడిచే శాతవాహన ఎక్స్‌ప్రెస్‌ను నర్సాపురం వరకూ పొడిగించాలని ఈ ప్రాంత ప్రజలు గత కొన్నేళ్లుగా కోరుతున్నారు. రైల్వే శాఖ ఆమోదం తెలిపినా అమలు కాలేదు.

నిర్మలా సీతారామన్‌పై ఆశలు

విజయవాడ–హుబ్లీ అమరావతి ఎక్స్‌ప్రెస్‌ను నర్సాపురం వరకూ పొడిగించాలని కోరిన మీదట రైల్వే శాఖ ఆమోదం తెలిపినా రైలును పొడిగించలేదు. నర్సాపురం–కోటిపల్లి రైల్వే లైన్‌కు లైన్‌క్లియర్ అయినా నిధులు విడుదల చేయలేదు. నర్సాపురం ప్రాంత కోడలైన కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ త్వరలో ప్రవేశపెట్టనున్న రైల్వే బడ్జెట్‌లో కొత్త రైళ్లకు అనుమతులు ఇవ్వాలని, కోటిపల్లి రైల్వే లైన్‌కు నిధులు కేటాయించాలని డెల్టా వాసులు కోరుతున్నారు.

గూడ్స్ రైళ్ల ట్రాఫిక్‌తో అవస్థలు



బ్రాంచి రైల్వే లైన్ ఆధునికీకరించిన తర్వాత గూడ్స్ రైళ్ల సంఖ్య విపరీతంగా పెరిగింది. ఆయా గేట్ల వద్ద గంటల తరబడి ప్రజలు వేసి చూడాల్సిన పరిస్థితి నెలకొంది. డబ్లింగ్, విద్యుద్దీకరణ లైన్ పూర్తయినందుకు ఆనందం కంటే గూడ్సు రైళ్లతో గేట్ల వద్ద పడుతున్న ఇబ్బందులు స్థానిక ప్రజలకు తీవ్ర నిరుత్సాహాన్ని మిగిల్చాయి. ప్రతి రోజూ 60కి పైగా గూడ్సు రైళ్లు విజయవాడ నుంచి గుడివాడ–భీమవరం–నిడదవోలు–రాజమండ్రి మీదుగా వైజాగ్ ఇతర జిల్లాలకు నడుస్తున్నాయి. పలు లెవల్ క్రాసింగ్‌ల వద్ద, పలు గేట్ల వద్ద నిమిషాల కొద్దీ వేచి ఉండాల్సి వస్తుంది. గత కొద్ది రోజులుగా ప్రజాందోళనతో గూడ్సు రైళ్ల రాకపోకల్ని కొంత మేర తగ్గించారు. ప్రస్తుతం 30కి పైగా గూడ్సులు నడుస్తున్నాయి.

ప్రజాప్రతినిధులు స్పందించాలి

బ్రాంచి రైల్వే లైన్ డబ్లింగ్, విద్యుదీకరణ పనులు పూర్తయ్యాయి. రైళ్ల రాకపోకలు పెరిగాయి. గతంలో నడిపిన ఒకటి రెండు రైళ్లను రద్దు చేసినా పట్టించుకోలేదు. కొత్త రైళ్ల కోసం ఈ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు రైల్వే శాఖను అడిగిన దాఖలాలు లేవు. పార్లమెంట్ సభ్యుల పట్టుదల, కృషితో కొత్త రైళ్లు ఏర్పాటు చేసే అవకాశం ఉంటుంది.

– రైల్వే అధికారి, బ్రాంచి రైల్వే లైన్

కొత్త రైళ్లు ఏర్పాటు చేయాలి



బ్రాంచి రైల్వే లైన్ విద్యుద్దీకరణ, డబలింగ్ చేయించిన ఎంపీ కనుమూరి బాపిరాజుకు ప్రత్యేక ధన్యవాదాలు. లైన్‌లో కొత్తగా కొన్ని రైళ్లను వచ్చే బడ్జెట్‌లో ఆమోదించాలి. హుబ్లీ, వారణాసి, వైజాగ్,సికింద్రాబాద్‌కు ఉదయం రైలు నడపాలి.

– ఎండీ. మదనీ, ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు, ఆకివీడు.

ఆదాయం పెరుగుతోంది



బ్రాంచి రైల్వే లైన్ అభివృద్ధితో రైల్వే శాఖకు ఆదాయం పెరుగుతోంది. గూడ్సు రైళ్ళ రాకపోకలు పెరిగాయి. ఇతర రాష్ట్రాల్లో ఆక్వా ఎగుమతులకు ప్రత్యేక గూడ్సు రైలు ఏర్పాటు చేస్తే మంచిది. వారానికి రెండు రోజులు నడిపితే డెల్టా ప్రాంతం నుంచి ఆక్వా ఎగుమతులు భారీగా జరిగే అవకాశం ఉంది.

– వేగేశ్న వెంకట్రాజు ఆక్వా రైతు, చినకాపవరం

ప్యాసింజర్ రైళ్లు నడపాలి



డబ్లింగ్, విద్యుదీకరణ గూడ్సు రైళ్ల కోసం ఏర్పాటు చేసినట్లుంది. పాసింజర్ రైళ్లతో పాటు కొత్త ఎక్స్‌ప్రెస్‌లను నడపాలి. ఆదాయం వచ్చే ఆకివీడు స్టేషన్‌లో ఎర్నాకులం ఎక్స్‌ప్రెస్‌కు హాల్ట్ ఇవ్వాలి. రైళ్ల వేగం పెంచి, సమయ పాలన పాటించాలి.

– షేక్ హుస్సేన్, రైల్వే ప్రయాణికుడు, ఆకివీడు

రీ సర్వేపై ప్రత్యేక దృష్టి

- కైకలూరు, ఉండి నియోజకవర్గాల్లో వేగవంతం చేయాలని ఆదేశాలు
- కైకలూరు, మండవల్లి, కాళ్ల, ఆకివీడుల్లో అధిక భూ వివాదాలు
- ప్రత్యేక శ్రద్ధ చూపాలని సీఎంఓ ఆదేశం



రీ సర్వే పనులను పరిశీలిస్తున్న ఏలూరు జిల్లా కలెక్టర్ ప్రసన్న వెంకటేష్

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సమగ్ర భూ సర్వే రెండో విడతలో కైకలూరు, ఉండి నియోజకవర్గాలు ప్రాధాన్యంగా తీసుకోనున్నారు. ఏలూరు, పశ్చిమగోదావరి జిల్లాల్లోని రెండు నియోజకవర్గాల్లోని కొన్ని మండలాల్లో భూ సంబంధిత వివాదాలు ఎక్కువగా ఉండటం. ఏళ్ల తరబడి సమస్యలు అపరిష్కృతంగా ఉండడంతో.. ప్రత్యేక శ్రద్ధతో ఈ రెండు నియోజకవర్గాల్లోని నాలుగు మండలాల్లో భూసర్వే పూర్తి చేయాలని అధికారులు నిర్ణయించారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి కూడా ఈ నాలుగు మండలాలపై స్పెషల్ ఫోకస్ పెట్టాలని ఆదేశాలు అందిన క్రమంలో యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు.

మొదటి విడతలో ఏలూరు జిల్లాలో 81 గ్రామాల్లో డ్రోన్ల సర్వే పూర్తి చేసి రీసర్వే పూర్తి చేశారు. ఈ నెల 2న ప్రారంభమైన రెండో విడతలో నూజివీడు, ముసునూరు, ఆగిరిపల్లి మండలాల్లో డ్రోన్ సర్వే ప్రారంభించారు. పశ్చిమగోదావరి జిల్లాలో మొదటి విడతలో 16 గ్రామాల్లో పైలెట్ ప్రాజెక్టుగా రీసర్వే పూర్తి చేశారు. ప్రస్తుతం రెండో విడతలో 9 మండలాల్లో 139 గ్రామాల్లో రీసర్వే ప్రారంభమైంది. పశ్చిమగోదావరి జిల్లాలోని 9 మండలాల్లో 133 గ్రామాల్లో 2,70,233 ఎకరాలు రీసర్వే చేయాల్సి ఉండగా ఇంతవరకు 13 గ్రామాల్లో డ్రోన్ ద్వారా సర్వే ప్రక్రియ పూర్తి చేశారు. ఈ కార్యక్రమం కోసం రెండు జిల్లాల్లో 650 మందికి పైగా సర్వే ఇంజనీర్లు, 40 మంది సర్వే అసిస్టెంట్లు, 800 మంది రెవెన్యూ అధికారులకు విధులు కేటాయించి పనులు వేగవంతం చేయిస్తున్నారు. ఈ క్రమంలో రెండు జిల్లాల్లో అత్యధికంగా వివాదాలు, స్పందనలో పిటిషన్లు ఎక్కువగా ఉన్న నాలుగు మండలాలను గుర్తించారు. కైకలూరు నియోజకవర్గంలోని కైకలూరు, మండవల్లి, ఉండి నియోజకవర్గంలో కాళ్ళ, ఆకివీడు మండలాల్లో రీసర్వే చేయనున్నారు.

నాలుగు మండలాలపై స్పెషల్ ఫోకస్

నాలుగు మండలాలపై రీసర్వే మొదలుపెట్టి వివాదాలు పూర్తి స్థాయిలో పరిష్కరించాలని ముఖ్యమంత్రి కార్యదర్శి రేవు ముత్యాలరాజు ఆదేశించారు. స్పందనలో ఈ నాలుగు మండలాలకు సంబంధించి వందల సంఖ్యలో ఫిర్యాదులు వస్తుండటంతో వీటిపై ప్రత్యేక దృష్టి పెట్టారు. కైకలూరు మండలంలో 23 గ్రామాలకు ఇప్పటికే 13 గ్రామాల్లో సమగ్ర రీసర్వే పూర్తి చేసి గుర్తింపు కార్డుల పంపిణీకి పూర్తి చేస్తున్నారు. మరో మూడు గ్రామాల్లో సర్వే పనులు, 7 గ్రామాల్లో డ్రోన్ ఎగురవేసే కార్యక్రమం నిర్వహిస్తున్నారు. మండవల్లి గ్రామంలో 31 గ్రామాలకు 7 గ్రామాలకు రీసర్వే పూర్తి చేసి హద్దులను ప్రకటించారు. మిగిలిన 12 గ్రామాల్లో రీసర్వే ప్రక్రియ, మరో 12 గ్రామాల్లో డ్రోన్ ఎగురవేసే కార్యక్రమానికి ఈ వారంలో శ్రీకారం చుట్టనున్నారు. ఉండి నియోజకవర్గంలోని కాళ్ళ మండలంలో 13 గ్రామాల్లో 36,561.69 ఎకరాల భూమి ఉండగా దీనిలో 3312.04 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నిర్ధారించి మిగిలిన భూమి రీసర్వే మొదలుపెట్టారు. ఒక గ్రామంలో 492.46 ఎకరాలు రీసర్వే పూర్తి చేశారు. ఆకివీడు మండలంలో 15 గ్రామాల్లో 29,971.29 ఎకరాలు భూమి ఉండగా దానిలో 4,576.68 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ మండలంలో సర్వే ఇప్పటికే ప్రారంభించారు. డ్రోన్లతో సర్వే నిర్వహించడంతో మ్యాపింగ్ త్వరగా పూర్తి చేయనున్నారు.

రెండో విడత రీ సర్వేకు చర్యలు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో రెండో విడత రీ సర్వే ప్రారంభమైందని రీ సర్వే డిసెంబరు 2023 కల్లా పూర్తిచేసేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టరు కార్యాలయం నుంచి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్సులో అధికారులతో కలెక్టరు మాట్లాడుతూ రీ సర్వే అన్ని గ్రామాలలో ప్రారంభించి డిసెంబరు 2023 నాటికి పూర్తి చేయాలని ఆదేశించారు. రీ సర్వేలో ప్రతి అంగుళం ప్రభుత్వ భూమిని గుర్తించి రికార్డు చేయాలని కలెక్టరు ఆదేశించారు. సర్వేకు అత్యంత ఆధునిక డ్రోన్లు వినియోగిస్తున్నామని చెప్పారు. నిర్ణీత సమయంలోగా భూ రీ సర్వే పూర్తి చేసేందుకు ప్రణాళికలు రూపొందించుకోవాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా రెవిన్యూ అధికారి కె.కృష్ణవేణి, సబ్ కలెక్టరు ఎం.సూర్యతేజ, ఆర్డీఓ దాసి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు వేగంగా పూర్తిచేయాలి : పేదల ఇళ్ల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేయాలని కలెక్టరు పి.ప్రశాంతి అధికారులను ఆదేశించారు. సోమవారం గృహ నిర్మాణాలపై మండల ప్రత్యేక అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాలు, అర్బన్ లే అవుట్లలో మౌలిక వసతులు, సదుపాయాలు త్వరితగతిన పూర్తి చేయాలన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి చర్యలు

జిల్లాలో బాల్య వివాహాల నిరోధానికి కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కలెక్టరు మండల స్థాయి అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయం నుంచి సబ్ కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్, ఎంపీడీవో, సీడీపీఓలతో సోమవారం కలెక్టరు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. బాల్య వివాహాలను అడ్డుకుని వారికి అవగాహన కల్పించాలని అన్నారు. ఎక్కడైనా చైల్డ్ మ్యారేజ్ జరుగుతుంటే వాటిని నిలుపుదల చేయాలని, జిల్లాలో చైల్డ్ మ్యారేజ్ జరగకూడదని ఆదేశించారు.

స్పందన సమస్యలపై తక్షణం స్పందించాలి



స్పందనలో ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): స్పందనకు ప్రతిస్పందన వేగంగా ఉండాలని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. స్పందనలో 243 దరఖాస్తులు స్వీకరించామన్నారు. అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ స్పందన దరఖాస్తులపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. దరఖాస్తు అధికారికి చేరిన వెంటనే అదే వేగంతో సమస్య పరిష్కారంతో కూడిన జవాబును పంపాలన్నారు. కొన్ని శాఖల్లో స్పందన దరఖాస్తులు నిర్ణీత గడువు దాటినా ఎందుకు పరిష్కారం కావడం లేదని ప్రశ్నించారు. భీమవరం, తణుకు, పాలకొల్లు, నరసాపురం జగనన్న లేఅవుట్లలో సిమెంట్ బ్రిక్ యూనిట్ల ఏర్పాటుకు నిర్ణయించామన్నారు. ప్రస్తుతం భీమవరంలో బ్రిక్ యూనిట్ ప్రారంభించామన్నారు. తణుకు, పాలకొల్లు, నరసాపురంలో కూడా వెంటనే సిమెంట్ బ్రిక్ యూనిట్లు ప్రారంభించేందుకు అధికారులు శ్రద్ధ వహించాలన్నారు. స్పందన కార్యక్రమంలో డీఆర్‌ఓ కె.కృష్ణవేణి, భీమవరం ఆర్డీవో దాసిరాజు, డీఎస్పీ బి.శ్రీకాంత్, జిల్లా జీఎస్‌డబ్ల్యూఎస్ ఆఫీసర్ కెసీహెచ్ అప్పారావు, డీపీఓ ఎస్.నాగలత, జిల్లా అధికారులు పాల్గొన్నారు. భీమవరానికి చెందిన ఎండీ ఫిరోజ్ స్పందనకు వచ్చి తాను 2021లో ఇసుక బుక్ చేసుకుని రూ.23 వేలు చెల్లించానని ఇంతవరకూ ఇసుక రాలేదని, దీనికి సంబంధించి చెల్లించిన మొత్తాన్ని తిరిగి ఇప్పించాలని కోరారు. వీరవాసరంలో ఎమ్మార్పీ భవన నిర్మాణం గత పదేళ్లుగా నిలిచిపోయిందని దీనిపై స్పందించి ఈ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలని వీరవాసరానికి చెందిన సామాజిక కార్యకర్త నెక్కెళ్ల శివరామకృష్ణ కలెక్టర్‌ను కోరారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కుష్టు వ్యాధి కేసులు ఎక్కువ అవుతున్నాయని.. ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా తీసుకొని కుష్టు వ్యాధి నివారణకు తోడ్పడాలన్నారు.

రెడ్‌క్రాస్ సొసైటీకి రూ.5,56,460 విరాళం

డీఆర్‌డీఏ ద్వారా రెడ్‌క్రాస్ సొసైటీ లైఫ్ టైం మెంబర్‌షిప్ రూ.1,100, లైఫ్ అసోసియేట్స్ మెంబర్ షిప్ రూ.410 చొప్పున వసూలు చేసిన మొత్తం రూ.5,56,460 చెక్కును స్పందన సమావేశ మందిరంలో డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఎంఎస్ఎస్ వేణుగోపాల్ జిల్లా కలెక్టర్‌కు అందజేశారు.

చేదోడు మూడో ఏడాది సాయం

10,348 మంది ఖాతాల్లో రూ.10.35 కోట్లు జమ



కలెక్టరేట్‌లో జగనన్న చేదోడు పథకం లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ పి.ప్రశాంతి

భీమవరం(ప్రకాశం చౌక్): షాపులు కలిగిన రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్లకు జగనన్న చేదోడు పథకం కింద ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేస్తామని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. జగనన్న చేదోడు పథకం కింద జిల్లాలో 2022- 23 ఆర్థిక సంవత్సరానికి 10,348 మంది లబ్ధిదారులకు రూ.10.35 కోట్ల చెక్కును సోమవారం భీమవరం కలెక్టరేట్‌లో లబ్ధిదారులకు కలెక్టర్ అందించారు. ముందుగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వినుకొండలో జగనన్న చేదోడు పథకాన్ని ప్రారంభించగా.. వర్చువల్‌గా కలెక్టర్ లబ్ధిదారులతో కలిసి తిలకించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 4,507 మంది టైలర్లుకు రూ 4.51 కోట్లు, 4,050 మంది రజకులకు రూ.4.05 కోట్లు, 1,791 మంది నాయీ బ్రాహ్మణులకు రూ.1.80 కోట్లు ఖాతాలలో జమ చేశామన్నారు. తొలి విడత 2020–21 ఆర్థిక సంవత్సరంలో 26,372 మంది లబ్ధిదారులకు రూ.26.37 కోట్లు, రెండో విడత 2021–22 ఆర్థిక సంవత్సరంలో 23,380 మంది లబ్ధిదారులకు రూ.23.38 కోట్లు చేదోడు కింద జమ చేశామన్నారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ ఏఈఓ కె.ప్రమీలరాణి, రజక కార్పొరేషన్ డైరక్టర్ రేవూరి గోగురాజు, అగ్ని కుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ బంధం పూర్ణచంద్రరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పి.గౌరీ తదితరులు పాల్గొన్నారు.

రజకులకు ఎంతో మేలు చేస్తున్నారు



ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి రజకుల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తున్నారు. ఒక పక్క సంక్షేమ పథకాలు అందిస్తూనే మరో పక్క ఏడాదికి రూ.10 వేల ఆర్థిక సాయం అందించి మేలు చేస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక సాయాన్ని రజకులు చక్కగా ఉపయోగించుకుంటున్నారు.

– రేవూరి గోగురాజు, రాష్ట్ర రజక కార్పొరేషన్ డైరక్టర్

రూ.10 వేల ఆర్థిక సాయం సంతోషదాయకం



నేను గత 20 ఏళ్లుగా టైలరింగ్ చేస్తున్నాను. గతంలో ఏ ప్రభుత్వం కూడా టైలర్లకు ఆర్థిక సాయం, ఇతర ప్రోత్సాహం ఇవ్వలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డి ఏటా రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం చేసి ఆదుకుంటున్నారు. ఇంతవరకు మూడు విడతల సాయం అందుకున్నాను.

– గుడిమెట్ల విజయలక్ష్మి, టైలర్, చినఅమిరం

క్లుప్తంగా

కూలిన చెట్టు.. కూలీ మృతి



మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై జయబాబు


బుట్టాయగూడెం: మండలంలోని మంగయ్య పాలెంలో చెట్టు మీద పడి ఒక కూలి మృతి చెందాడు. ఎస్సై ఎం.జయబాబు తెలిపిన వివరాల ప్రకారం తెలంగాణ రాష్ట్రం అశ్వారావుపేట మండలం వేదాంతపురం గ్రామానికి చెందిన కొడవర్తి రాంబాబు (23) మంగయ్యపాలెంలో కార్పెంటరీ వర్క్ చేస్తున్నాడు. సోమవారం పని అనంతరం టీ తాగుతూ ఇంటి బయటకు వస్తుండగా పక్కనే ఉన్న చింతచెట్టు ఒక్కసారిగా రాంబాబుపై కూలింది. దీంతో అపస్మారక స్థితిలో ఉన్న రాంబాబును నందాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా వైద్యులు పరీక్షించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడి బావమరిది ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

దొంగకు ఏడాది జైలు


కాళ్ల : గత ఏడాది కాళ్లకూరు శివాలయంలో నగలు చోరీ కేసులో ఓ వ్యక్తి నేరం రుజువు కావడంతో ఏడాది జైలు శిక్ష విధిస్తూ ఫస్ట్ అడిషనల్ కోర్టు జడ్జి ఎ.పవన్ కుమార్ తీర్పు ఇచ్చారు. వివరాలిలా ఉన్నాయి. కృష్ణా జిల్లా ఉయ్యూరు మండలం తోట్ల వల్లూరుకు చెందిన పిట్టు రాము అలియాస్ రాజేష్ కాళ్లకూరు శివాలయంలో నగల దొంగతనానికి పాల్పడ్డాడు. అప్పటి ఎస్సై వి.రాంబాబు నిందితుడిని అరెస్టు చేసి కేసు నమోదు చేశారు. ఆకివీడు సీఐ గీతా రామకృష్ణ ఆధ్వర్యంలో కాళ్ల ఎస్సై ఆర్.మల్లికార్జునరెడ్డి భీమవరం ఫస్ట్ అడిషనల్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టారు.

రేపటి నుంచి నరసన్న పెళ్లి సందడి

- ఐఎస్ జగన్నాథపురంలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి దివ్య కల్యాణోత్సవాలు
- భీష్మ ఏకాదశి నుంచి ఆరు రోజుల పాటు అంగరంగ వైభవంగా వేడుకలు
- 3న స్వామివారి కల్యాణం
- ముస్తాబైన సుందరగిరి.. ఏర్పాట్లు పూర్తి



సుందరగిరిపై శ్రీ లక్ష్మీ నరసింహ స్వామివారి ఆలయం



ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన షామియానా పందిళ్లు, గర్భాలయంలో కొలువైన శ్రీ లక్ష్మీనారసింహుడు

ద్వారకాతిరుమల: శ్రీవారి ఆలయానికి దత్తత దేవాలయమైన ఐఎస్ జగన్నాథపురంలోని సుమనోహర సుందరగిరిపై శ్రీలక్ష్మీ నరసింహస్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలు బుధవారం నుంచి ప్రారంభం కానున్నాయి. భీష్మ ఏకాదశి పర్వదినం నుంచి ఆరు రోజుల పాటు ఈ ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరగనున్నాయి. కల్యాణోత్సవాలకు దేవస్థానం భారీగా ఏర్పాట్లు చేస్తోంది. షామియానా, చలువ పందిర్లు, ప్రత్యేక దర్శనం క్యూలైన్ల నిర్మాణాలు, విద్యుద్దీప అలంకారాల పనులు పూర్తయ్యాయి. ఇదిలా ఉంటే ఆహ్లాదకర వాతావరణంలో, పురాణ ప్రాశస్త్యం గల ఈ ఆలయాన్ని దర్శిస్తే కోరిన కోర్కెలు తీరి, సకల శుభాలు కలుగుతాయన్నది భక్తుల నమ్మకం. అందుకే ఏకాదశి వంటి పర్వదినాల్లో వేలాదిగా భక్తులు ఈ ఆలయాన్ని సందర్శిస్తుంటారు. చినవెంకన్న దేవస్థానం ప్రతి ఏటా స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవాలను అట్టహాసంగా నిర్వహిస్తోంది. ఇటీవల దాతల సహకారంతో ఈ ఆలయాన్ని రూ.3 కోట్లతో అభివృద్ధి చేశారు.

ఉత్సవ విశేషాలివే..

- ఫిబ్రవరి 1న ఉదయం 10 గంటలకు స్వామి, అమ్మవార్లను పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలను చేయడం, భరతనాట్య ప్రదర్శనలు
- 2న ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం వరకు నిత్య హోమాలు, మూలమంత్ర హవనములు, బలిహరణ, వేద పారాయణ, నిత్య హోమాలు, మండప పూజలు, హారతి తదితర పూజలు, త్రిరత్నాల నాటక ప్రదర్శన
- 3న ఉదయం 11.10 గంటల నుంచి స్వామివారి దివ్య కల్యాణ మహోత్సవం, భక్తి రంజని కార్యక్రమం
- 4న సాయంత్రం 6 గంటల నుంచి స్వామివారి గ్రామోత్సవం, శ్రీరామాంజనేయ పౌరాణిక నాటక ప్రదర్శన
- 5న ఉదయం 7 గంటల నుంచి స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు, చందనోత్సవం, సాయంత్రం 6 గంటలకు ధ్వజావరోహణ, హరికథ కాలక్షేపం
- 6న రాత్రి 7 గంటల నుంచి ద్వాదశ కోవెల ప్రదక్షిణలు, శ్రీపుష్ప యాగోత్సవం, సత్యహరిశ్చంద్ర నాటక ప్రదర్శన

క్షేత్ర విశిష్టత

మతంగి మహర్షి తపస్సు ఫలితంగా సుందరగిరిపై శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారు స్వయంభూగా శాలిగ్రామ రూపంలో వెలిశారు. ఇప్పటికీ మతంగి మహర్షి సర్పరూపంలో స్వామివారిని నిత్యం సేవిస్తారని ప్రసిద్ధి. ఆలయం వెనుక ఎన్నో ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఉన్న పుట్టే ఇందుకు నిదర్శనమని ఆలయ అర్చకులు చెబుతున్నారు. ఇదిలా ఉంటే ఉగ్రరూపంలో ఉన్న స్వామివారిని శాంతింపజేసేందుకు 1995లో తమిళనాడుకు చెందిన శ్రీధర్ గురూజీ, హైదరాబాద్‌కు చెందిన ఆయన ప్రధాన శిష్యులు కొచ్చెర్లకోట నరసింహ గురూజీలు ఆలయ ఆవరణలో కనకవల్లీ దేవి అమ్మవారి విగ్రహాన్ని, అలాగే అష్టదిక్కులలో మండపాలను ఏర్పాటు చేశారు. మన రాష్ట్రంలోని ఏ ఆలయంలోను లేనటువంటి ఏకాక్షరి గణపతి, కాలభైరవుడు, సర్పవెంకటేశ్వరుడు, చింతామణి గణపతి, సుబ్రహ్మణ్యస్వామి, దత్తాత్రేయుడు, నవగ్రహాలు, అలాగే ఆలయ క్షేత్రపాలకుడైన ఆంజనేయ స్వామివారు ఇక్కడ భక్తులకు దర్శనమిస్తున్నారు. ఏటా మహాశివరాత్రి పర్వదినం నాడు కొచ్చెర్లకోట నరసింహ గురూజీ ఆధ్వర్యంలో జ్వాలా సంపుటిత మహా సుదర్శన యాగాన్ని ఘనంగా జరుపుతున్నారు. అందులో సినీ, రాజకీయ ప్రముఖులు పాల్గొంటారు. అదేవిధంగా ప్రతి ఏటా భీష్మ ఏకాదశి పర్వదినం మొదలుకుని ఆరు రోజుల పాటు స్వామివారి వార్షిక కల్యాణ వేడుకలను శ్రీవారి దేవస్థానం అత్యంత వైభవంగా నిర్వహిస్తోంది.

భారీగా ఏర్పాట్లు



నారసింహుని దివ్య కల్యాణ మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ వేడుకల్లో పాల్గొనే భక్తులకు అన్ని సౌకర్యాలను కల్పిస్తున్నాం. కొండ కింద కల్యాణ మండపంలో ఫిబ్రవరి 3న స్వామివారి కల్యాణాన్ని కనుల పండువగా జరిపేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ వేడుకల్లో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని తరించాలి.

– వేండ్ర త్రినాథరావు, శ్రీవారి దేవస్థానం ఈఓ

‘ఉండమ్మా బొట్టు పెడతా’



ఆర్టీసీ డ్రైవర్ల భార్యలకు రవికల గుడ్డ, తాంబూలం, పసుపు కుంకుమలు సమర్పిస్తున్న మహిళా ఉద్యోగి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): రహదారిపై ఎదురయ్యే సవాళ్లను, ట్రాఫిక్ సమస్యలను ఎంతో ఓపికగా అధిగమించి లక్షలాది మంది ప్రయాణికులను నిత్యం వారి గమ్యస్థానాలకు క్షేమంగా చేరుస్తున్న ఆర్టీసీ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు సోమవారం గొప్ప అనుభూతి చెందారు. ఆర్టీసీ డ్రైవర్ల భార్యలకు ‘ఉండమ్మా బొట్టుపెడతా’ అని వినూత్న సంప్రదాయానికి ఏలూరు జిల్లా ప్రజారవాణా శాఖ అధికారి ఎన్వీఆర్ వరప్రసాదం శ్రీకారం చుట్టారు. బస్సులు నడుపుతూ ప్రమాదాలకు కారకులైన కేసుల్లో ఉన్న డ్రైవర్ల కుటుంబ సభ్యులకు ఆర్టీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా సోమవారం స్థానిక ప్రజారవాణా అధికారి కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి డ్రైవరూ తనపై కుటుంబ సభ్యులు ఆధారపడి ఉన్నారనే సత్యాన్ని గ్రహించి తమ అలవాట్లను మార్చుకోవాలని సూచించారు. డ్రైవింగ్ చేసేటప్పుడు సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని, ఓపికగా డ్రైవింగ్ చేయాలని, గతంలో జరిగిన తప్పులు భవిష్యత్‌లో పునరావృతం కాకుండా జాగ్రత్త వహించాలని హితవు పలికారు. తమ భర్తలు ఆహ్లాదభరిత వాతావరణంలో విధులు నిర్వహించేలా భార్యలు ప్రోత్సహించాలని సూచించారు. ఈ సందర్భంగా డ్రైవర్ల భార్యలకు మహిళా సిబ్బందితో పసుపు, కుంకుమ అందించి, రవికల గుడ్డలు, తాంబూలం సమర్పించి వారికి సాదరంగా సాగనంపారు.

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

రోప్ స్కిప్పింగ్ పోటీల విజేత తూర్పుగోదావరి

- ద్వితీయ, తృతీయ స్థానాల్లో పశ్చిమగోదావరి, గుంటూరు
- భీమవరంలో ముగిసిన రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు
- జాతీయ పోటీలకు అండర్-14, 17, 19 బాలురు, బాలికల జట్ల ఎంపిక



జాతీయ పోటీలకు ఎంపికైన అండర్-14 బాలుర జట్టు



అండర్-14 బాలికల జట్టు



అండర్-17 బాలుర జట్టు



అండర్-17 బాలికల జట్టు



అండర్-19 బాలుర జట్టు



అండర్-19 బాలికల జట్టు

సాక్షి, భీమవరం: భీమవరంలోని బ్రౌనింగ్ జూనియర్ కాలేజీలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ పోటీల్లో తూర్పుగోదావరి జిల్లా ప్రథమస్థానాన్ని దక్కించుకోగా, పశ్చిమ, గుంటూరు జిల్లాలు ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచినట్లు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ బేగారి జాన్సన్ చెప్పారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహుమతి ప్రదానోత్సవ సభలో బ్రౌనింగ్ జూనియర్ కాలేజ్ చైర్మన్, వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనారిటీస్ సెల్ రాష్ట్ర చైర్మన్ మేడిది జాన్సన్, కరస్పాండెంట్ మేడిది ఎస్తేరు ప్రియాంక ముఖ్య అతిథులుగా హాజరై విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్స్, అందజేశారు. ఈ సందర్భంగా జాన్సన్ మాట్లాడుతూ క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడడమేగాక ఉపాధి అవకాశాలు ఎంతగానో మెరుగుపడతాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నట్లు చెప్పారు. జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ బేగారి జాన్సన్ మాట్లాడుతూ పోటీలలో వివిధ జిల్లాల నుంచి 320 మంది క్రీడాకారులు, 35 మంది కోచ్‌లు, మేనేజర్లు పాల్గొన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో ఆర్.వెంకటరమణ, కళాశాల ప్రిన్సిపాల్ రంప ఎలీష, పీడీ సాయిదావూద్, జిల్లా వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి కృష్ణారెడ్డి, ఎండీ కుద్దూస్, ఆర్.రామకృష్ణ పాల్గొన్నారు.


జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులు వీరే..

అండర్-14 విభాగంలో : బాలుర జట్టుకు ఎస్.సంతోష్‌కుమార్, కె.తనూజ్ (తూర్పుగోదావరి), పి.గోపీకృష్ణ, ఎ.శంశాక్ (పశ్చిమగోదావరి), ఎస్కే అబ్దుల్ రహీమ్ (గుంటూరు), ఎన్.అఖిల్‌నాయుడు (చిత్తూరు), బాలికల విభాగంలో ఎల్.లక్ష్మీ వీరప్రసన్న, కె.ప్రేమజ్యోతి, డీకే వైష్ణవి, కె.మహి (తూర్పుగోదావరి), డి.ఆయూషా (గుంటూరు), టి.తనిష్క (పశ్చిమగోదావరి) ఎంపికయ్యారు.

అండర్-17 విభాగంలో : బాలుర జట్టుకు డి.దుర్గాప్రసాద్, కె.నూకరాజు, కె.త్రిమూర్తి (తూర్పుగోదావరి), ఎస్.వెంకటేశ్వర్లు, ఎస్కే షకీర్‌బాషా(గుంటూరు), ఎన్.రవీంద్రర్, బాలికల విభాగంలో కె.తులసీ అంజలి, ఎం.వీరమణి (తూర్పుగోదావరి), డి.దీపిక, పి.స్వాతి (నెల్లూరు), ఎస్.రమ్య (చిత్తూరు), ఎం.శివసాయి (కడప) ఎంపికయ్యారు.

అండర్-19 బాలుర విభాగంలో : ఆర్.ఏసు, వై.సూరిబాబు, వి.ఫణికుమార్, డి.ప్రసాద్ (పశ్చిమగోదావరి), బాల శివతేజ (తూర్పుగోదావరి), బీఎస్ తేజిత్ (కడప), బాలికల విభాగంలో ఎంపీ ప్రసన్న, ఎం.నాగదేవి, ఎ.యామినిదేవి, పి.దీపికుమారి (తూర్పుగోదావరి), బి కీర్తి (పశ్చిమగోదావరి), ఎస్.షకీర (కడప) ఎంపికైనట్లు జాన్సన్ తెలిపారు.

ఇంటింటా ఆదరణ



తాడేపల్లిగూడెం రూరల్ : నీలాద్రిపురం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఓ మహిళకు ప్రభుత్వ సంక్షేమ పథకాల వల్ల కలిగిన లబ్ధిని వివరిస్తున్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ



పెనుగొండ (ఆచంట) : ఆచంటలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ప్రభుత్వ సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందిస్తూ ఓ మహిళ సమస్య వింటున్న ఆచంట ఎమ్మెల్యే చెరుకువాడ శ్రీరంగనాథరాజు

5న ఉల్లంపర్రులో గాయత్రీ మహాయజ్ఞం

- 108 హోమగుండాలతో 864 దంపతులతో నిర్వహణ
- సకారాత్మ ఫౌండర్ ప్రేమ్ నిరంతర్ గురూజీ వెల్లడి



మాట్లాడుతున్న సత్యసేవక్ ప్రేమ్ నిరంతర్ గురూజీ (నాన్న), చిత్రంలో డాక్టర్ బాబ్జి, డీటీడీసీ బాబు

పాలకొల్లు అర్బన్ : లోక కల్యాణార్థం, సనాతన సంప్రదాయాల పరిరక్షణ కోసం ఉల్లంపర్రు అద్దేపల్లి సూర్యరామచంద్ర రైస్‌మిల్లు ప్రాంగణంలో ఫిబ్రవరి 5వ తేదీన సకారాత్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో దాతల సహకారంతో మహా సంకల్ప విశ్వశాంతి గాయత్రీ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకుడు సత్య సేవక్ ప్రేమ్ నిరంతర్ గురూజీ (నాన్న) వెల్లడించారు. ఉల్లంపర్రు ఏఎస్ఆర్ ప్రాంగణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గాయత్రీ మహాయజ్ఞంలో పాల్గొనే దంపతులు ఎటువంటి రుసుము చెల్లించనవసరం లేదన్నారు. కుల, మత, వర్గ భేదాలకు తావులేకుండా సర్వమానవాళి ప్రయోజనం కోసం ఈ గాయత్రీ మహాయజ్ఞం తలపెట్టినట్లు వివరించారు. 100 గ్రాముల నెయ్యి హోమగుండంలో వెలిగిస్తే 10 వేల టన్నుల ఆక్సిజన్ విడుదల అవుతుందన్నారు. కరోనా వైరస్ మానవాళిని సర్వనాశనం చేసిందని, అప్పటినుంచి చాలా మంది రకరకాల అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారన్నారు. రాబోయే కాలంలో చాలా వైరస్‌లు మానవాళికి కీడుతలపెట్టనున్నట్లు ఆయన వివరించారు. సర్వరోగ నివారణకు గాయత్రీ మహాయజ్ఞంలో వెలిగించే హోమ క్రతువులు ఎంతో ఉపయోగపడతాయన్నారు. 824 సంవత్సరాలకు ఒకసారి వచ్చే మాఘపౌర్ణమి ఎంతో విశిష్టమైందన్నారు. 864 మంది దంపతులతో 108 హోమ గుండాలతో సుమారు 10వేల మంది భక్తులతో ఈ మహాయజ్ఞం నిర్వహిస్తున్నట్లు వివరించారు. మాజీ ఎమ్మెల్యే డా.సీహెచ్ సత్యనారాయణమూర్తి (బాబ్జి) మాట్లాడుతూ తొలుత 4వ తేదీ సాయంత్రం 4 గంటలకు ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీక్షీరారామలింగేశ్వర స్వామి ఆలయం నుంచి 108 కలశాలతో జ్యోతులు, ముత్తైదువలతో, మేళతాళాలు, కోలాటం, దాండియాలతో గాయత్రీ మాత శోభాయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కొండా నరసింహారావు, అలివేలు మంగాదేవి (విజయవాడ) దంపతులతో శంఖారావం పూరించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. అలాగే యామ వీరేష్, విజయ దంపతులు 108 దక్షిణావృత శంఖాలు విరాళంగా అందిస్తున్నారన్నారు. విలేకరుల సమావేశంలో జెడ్పీటీసీ సభ్యులు నడపన గోవిందరాజులనాయుడు, పంచాయతీ కార్యదర్శి డీఎస్ పద్మాజీరావు, గాయత్రీ మహాయజ్ఞ నిర్వాహణ కమిటీ అధ్యక్షుడు రేపూరి సూర్యనారాయణ, గౌరవాధ్యక్షుడు పీవీఎస్ సూర్యనారాయణరాజు (డీటీడీసీ బాబు), ముఖ్య సలహాదారులు పెన్మెత్స సాయిరాజు, కేవీఎస్ఎస్ నరసింహరాజు, వై.రామమోహన్‌రావు, నంబూరి శ్రీనివాసరావు, మద్దింశెట్టి రమేష్, బాలి ఏడుకొండలు, కేవీఆర్‌కే మోహన్ పాల్గొన్నారు.

ఫెన్సింగ్ జాతీయ పోటీలకు భీమవరం విద్యార్థులు



ఫెన్సింగ్ పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: రాష్ట్ర స్కూల్ గేమ్స్ ఫెన్సింగ్ పోటీలలో పట్టణంలోని భారతీ విద్యాభవన్స్‌కు చెందిన విద్యార్థులు మంతెన అనీష్‌వర్మ, బి.భరత్‌కృష్ణంరాజు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ఫెన్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.కృష్ణమోహన్ చెప్పారు. జనవరి 27వ తేది నుంచి మూడు రోజులపాటు కర్నూలులో జరిగిన ఫెన్సింగ్ పోటీల్లో అండర్-17 ఈపీ విభాగంలో మంతెన అనీష్‌వర్మ రజత పతకం, అండర్-14 సేబర్ విభాగంలో బి.భరత్ కృష్ణంరాజు, ఎ.మణికంఠ రజత పతకాలు సాధించారన్నారు. వీరిలో అనీష్‌వర్మ, భరత్ కృష్ణంరాజు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కృష్ణమోహన్ వివరించారు.

రైలు కింద పడి గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



రైలు పట్టాలపై ఉన్న వ్యక్తి మృతదేహం

ఆకివీడు: స్థానిక దుంపగడప రైల్వే గేటు సమీపంలో సోమవారం మధ్యాహ్నం రైలు కింద పడి ఓ గుర్తుతెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడని భీమవరం రైల్వే జీఆర్పీ ఎస్సై రమణ చెప్పారు. విజయవాడ నుంచి నరసాపురం వైపు వెళ్లే గుర్తు తెలియని రైలు కింద పడి మృతి చెందినట్లు తెలిపారు. ఇతనిని పాలకొల్లు మునిసిపల్ ఉద్యోగిగా అనుమానిస్తున్నట్లు తెలిపారు. సంబంధిత వ్యక్తులకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చి నిర్ధారించిన తరువాత పూర్తి వివరాలు తెలుస్తాయన్నారు. అలాగే మృతదేహం వద్ద సూసైడ్ నోటు లభించిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భీమవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

చెక్కు బౌన్స్ కేసులో నిందితుడికి 18 నెలల జైలు

సాక్షి, భీమవరం: చెక్కు బౌన్స్ కేసులో నిందితుడికి 18 నెలల జైలు శిక్ష, రూ.35 లక్షల జరిమానా విధిస్తూ భీమవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ డి.సోని తీర్పు చెప్పినట్లు న్యాయవాది అల్లూరి శివాజీరాజు సోమవారం చెప్పారు. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. భీమవరం పట్టణంలో రుద్రరాజు శ్రీధర్‌వర్మకు చెందిన కంపెనీలో 2016లో నిడమర్రు మండలం చానమిల్లి గ్రామానికి చెందిన గరిగిపాటి గనిరాజు(గణేష్)కు రొయ్యల మేత కొనుగోలు చేసి బాకీ నిమిత్తం అదే ఏడాది సెప్టెంబర్ 27వ తేదీన రూ.35 లక్షల చెక్కు ఇచ్చారు. అయితే చెక్కు బౌన్స్ కావడంతో న్యాయవాది శివాజీరాజు కోర్టులో ఫిర్యాదు చేయడంతో విచారణ అనంతరం జడ్జి సోని నిందితుడికి 18 నెలల జైలు శిక్ష, రూ.35 లక్షలు చెల్లించాలని సోమవారం తీర్పు చెప్పినట్లు న్యాయవాది శివాజీరాజు తెలిపారు.

క్లుప్తంగా

కంతేరులో పొలంబడి



కంతేరులో పొలంబడి నిర్వహిస్తున్నా వ్యవసాయాధికారులు

ఇరగవరం: మండలంలోని కంతేరు గ్రామంలో సోమవారం వ్యవసాయ అధికారులు రైతులకు పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వై రాఘవేంద్ర మాట్లాడుతు ప్రస్తుతం మండలంలో చాలా చోట్ల కాండం తొలుచు పురుగు సమస్య ఎక్కువగా ఉందన్నారు. ఈ కాండం తొలుచు పురుగు జీవిత చక్రన్ని రైతులకు వివరించడం జరిగింది. సస్య రక్షణ చర్యలు ఏవిధంగా పాటించాలనే దానిపై రైతులకు అవగాహన కల్పించారు. సస్య రక్షణలో భాగంగా మోనో క్రోటోపాస్ అనే మందును1.6 ఎంఎల్ , లీటర్ నీటికి, లేదా కార్టప్ హైడ్రో క్లోరైడ్ అనే మందును 2 గ్రాములు లీటర్ నీటికి గాని కలిపి పిచికారి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విఏఏ కె స్నేహ దీప్తి , ఎంపీటీసీ సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్టీసీ ప్రయాణం సురక్షితం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఆర్టీసీ ప్రయాణం సురక్షితమని డీఎం యేలూరి సత్యనారాయణ మూర్తి అన్నారు. ప్రతి ఒక్కరూ భద్రతా నియమాలు పాటించాలని తెలిపారు. నిడదవోలు రైల్వే గేటు మరమత్తులు నిమిత్తం ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 8వ తేదీ వరకు రైల్వే గేటు మూసి వేస్తున్నందున తాడేపల్లిగూడెం నుంచి నిడదవోలు రైల్వే గేటు వరకు గూడెం డిపో బస్సులు ప్రతి 20 నిమిషాలకు బస్ సౌకర్యం ఏర్పాటు వెల్లడించారు. ప్రయాణీకులు ఈ సౌకర్యాన్ని గుర్తించాలని, అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

అంతర్వేది తీర్థానికి ప్రత్యేక బస్సులు: ఏపీ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ తాడేపల్లిగూడెం ఆర్టీసీ డిపో నుంచి అంతర్వేది తీర్థానికి ఈ నెల 31 తేదీ నుంచి ఫిబ్రవరి 1వ తేదీ వరకు భక్తుల సౌకర్యార్థం ఉదయం 4.30 గంటల నుంచి ప్రతి 20 నిమిషాలకు బస్సు సౌకర్యం ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీఎం యేలూరి సత్యనారాయన మూర్తి విజ్ఞప్తి చేశారు.

మహాశివునికి విశేష అభిషేకాలు



శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామివారిని విశేషంగా అలంకరించిన దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని శివాలయాల్లో సోమవారం మహాశివునికి విశేష అభిషేకాలు నిర్వహించారు. దీనిలో భాగంగా కొండ్రుప్రోలు, కుంచనపల్లి, పెదతాడేపల్లి, వెంకట్రామన్నగూడెం, చినతాడేపల్లి, కడియద్ద, వీరంపాలెం, నవాబుపాలెం తదితర గ్రామాల్లోని శివాలయాల్లో జలాభిషేకం, పంచామృతాభిషేకాలను అర్చకులు జరిపించారు. స్వామి వారికి ప్రీతికరమైన రోజు కావడంతో భక్తులు విశేషంగా తరలివచ్చి, దర్శించుకున్నారు.

శునకాలకు టీకాలు తప్పనిసరి



కుక్కలకు టీకాలు వేస్తున్న అధికారులు, చిత్రంలో ఎంపీపీ హరిబాబు, డీడీ జాఫర్‌హుస్సేన్

ఉండి : స్థానిక ప్రాంతీయ పశువైద్యశాలలో పశు సంవర్ధకశాఖ, ఉండి లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం జంతు సంరక్షణ పక్షోత్సవం నిర్వహించారు. ఎంపీపీ ఇందుకూరి శ్రీహరి నారాయణరాజు, పశుసంవర్ధకశాఖ డీడీ డాక్టర్ జాఫర్‌హుస్సేన్ మాట్లాడుతూ జంతువులు మానవ జీవితంలో ఓ భాగమని వాటిని హింసించడం తగదని అన్నారు. పెంపుడు జంతువులను పట్ల చూపిస్తున్న జాలి, దయ వీధిలో సంచరించే జంతువులపైనా చూపించాలన్నారు. వైద్యుల సూచనలతో కుక్కలకు తప్పనిసరిగా టీకాలు వేయించాలన్నారు. పశుసంవర్ధకశాఖ ఉపసంచాలకుడు డాక్టర్ జీ మల్లేశ్వరరావు, ఈవోపీఆర్‌డీ కె.కొండలరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కమతం బెనర్జీ తదితరులు మాట్లాడుతూ సచివాలయంలో వెరట్నరీ అసిస్టెంట్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించిందని, పశువుల ఇబ్బందికర పరిస్థితి వస్తే వెంటనే వారికి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఉపాధ్యక్షుడు గాదిరాజు రంగరాజు, కలిదిండి సీతారామరాజు, రుద్రరాజు నరసరాజు, సత్తి బ్రమ్మారెడ్డి, గాదిరాజు వెంకటేశ్వరరాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే సీఎం జగన్ లక్ష్యం

- ఉప ముఖ్యమంత్రి 'కొట్టు సత్యనారాయణ
- నీలాద్రిపురం గడప గడపకు మన ప్రభుత్వం



తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

తాడేపల్లిగూడెం రూరల్: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పరిపాలన సాగిస్తూ ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ తెలిపారు. సోమవారం సాయంత్రం తాడేపల్లిగూడెం మండలం నీలాద్రిపురం గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత నీలాద్రిపురం సచివాలయం ఆవరణలోని అంబేడ్కర్, వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రంలో లోకేష్‌నాయుడు పాదయాత్ర ప్రారంభించడంతో జనసేనాని పవన్ పాదయాత్ర విరమించారని, వారాహికి పూజలతోనే సరిపెట్టారని ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ ఎద్దేవా చేశారు. మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి ఇచ్చిన ప్రతి హామీని అమలు చేసిన వ్యక్తి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అని, ప్రజలు ఆయన పాలనలో సంతోషంగా ఉన్నారన్నారు. చంద్రబాబు మేనిఫెస్టోను వెబ్‌సైట్ నుంచి తొలగించారని విమర్శించారు. జగన్ పాలనలో రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉంటే చంద్రబాబులో కనీసం పశ్చాత్తాపం రావడం లేదన్నారు. తన సామాజికవర్గానికి చంద్రబాబు ఏం న్యాయం చేశారని నిలదీశారు. జగన్ రూపంలో రాష్ట్రానికి మంచి నాయకత్వం వచ్చిందన్నారు. ఆ నాయకత్వాన్ని రాష్ట్ర ప్రజలు నిలబెట్టుకోవాలన్నారు. అనంతరం ఇంటింటికి తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరును, ప్రతి గృహంలోని వారికి అందిన సంక్షేమ పథకాల లబ్ధిని గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ ముత్యాల ఆంజనేయులు, ఎంపీపీ పొనుకుమాటి శేషులత, వైస్ ఎంపీపీలు సూర్నని రామకృష్ణ, కట్టా రంగబాబు, సర్పంచ్‌లు రాజమహేంద్రవరపు లక్ష్మణరావు, ఎలిపే గాంధీ, ఉప సర్పంచ్‌లు మేణ్ణి రామారావు, చిట్టూరి కాశీవిశ్వనాథం, ఎమ్పీటీసీ మార్లపూడి సుబ్బారావు, మట్టా సత్యనారాయణ, సచివాలయ మండల కన్వీనర్ ముప్పిడి సంపత్‌కుమార్, కళింగ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ సంపతరావు కృష్ణారావు, మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ ముప్పిడి వెంకట్రామిరెడ్డి (పెద్దబ్బులు రెడ్డి), మండల సేవాదళ్ అధ్యక్షుడు కొండుబోయిన కృపావరం, సొసైటీ చైర్మన్లు వెలిశెట్టి నరేంద్రకుమార్, జడ్డు హరిబాబు, చిక్కాల సత్యనారాయణ, గుమ్మళ్ళ తాతారావు, తహసీల్దార్‌వైకేవీ.అప్పారావు, ఎంపీడీవో ఎం.వెంకటేష్, పీఆర్ డీఈ వీఎస్.వేణుగోపాల్, ఏపీవో ఏవీవీఎస్‌వీ.ప్రసాద్, పంచాయతీ కార్యదర్శి టి.పవన్‌కుమార్, పీఆర్ ఏఈ జి.పవన్‌కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ ఆర్.శ్రీనివాస్, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ కె.నాగేశ్వరరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.విశాలాక్షి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

ఉద్యాన విద్యార్థుల దక్షిణ భారతయాత్ర



విద్యార్థుల యాత్ర బస్సులకు జెండా ఊపుతున్న వీసీ టి.జానకీరామ్

తాడేపల్లిగూడెం: డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో వెంకటరామన్నగూడెం ఉద్యాన కళాశాలలో బీఎస్సీ హార్టికల్చర్ డిగ్రీ ఆఖరి సంవత్సరం చదువుతున్న 120 మంది విద్యార్థులు ఉద్యాన పరిశోధనాలయాల సందర్శనకు బయలుదేరారు. దక్షిణ భారతదేశంలోని వివిధ పరిశోధనా స్థానాలను , ప్రాముఖ్యమైన సంస్థలను సందర్శించే నిమిత్తం 12 రోజుల యాత్రకు బయలుదేరారు. క్లాసు రూమ్‌లో నేర్చుకొనే వివిధ అంశాలు, క్షేత్రస్థాయిలో చూడటం చాలా ప్రయోజనకరంగా ఉంటుందని వీసీ టి.జానకీరామ్ యాత్ర బస్సులకు జండా ఊపుతూ అన్నారు. వివిధ ప్రాంతాల్లో సాగు పద్ధతులు, ఆహారపు అలవాట్లు ప్రత్యక్షంగా చూడటానికి ఈ యాత్ర విద్యార్థులకు గొప్ప అనుభవంగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ రిజిస్ట్రార్ బి.శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

భీష్మ ఏకాదశి మహోత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



శ్రీకేశవస్వామి ఆలయంలో భీష్మ ఏకాదశి మహోత్సవాలపై చర్చిస్తున్న అధికారులు, కమిటీ నాయకులు

తణుకు అర్బన్: భీష్మ ఏకాది మహోత్సవాలకు తణుకు శ్రీదేవి, భూదేవి సమేత శ్రీకేశవస్వామి ఆలయం ముస్తాబైంది. ఈనెల 30 నుంచి వచ్చేనెల 5వ తేదీ వరకు నిర్వహించనున్న స్వామివారి దివ్య తిరు కల్యాణ మహోత్సవాలకు దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ ధర్మకర్తల మండలి ఆధ్వర్యంలో సర్వం సిద్ధం చేశారు. తణుకు పరిసరప ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు అధికసంఖ్యలో వస్తారనే ఉద్దేశ్యంతో అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. సోమవారం ఉదయం స్వామి వారిని పత్ర్యేకంగా అలంకరించారు. 31న ఉదయం విశేష పూజాధికాలు నిర్వహించి రాత్రి 2.30 గంటలకు స్వామి, అమ్మవార్లకు వేదపండితుల వేద మంత్రోచ్ఛరణముల మధ్య కల్యాణం అత్యంత వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ తెలిపారు. భీష్మ ఏకాదశి మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించాలనే ఉద్దేశ్యంతో సోమవారం ఆలయ ఆవరణలో దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు, ఆలయ ధర్మకర్తల మండలి సభ్యులు సమావేశమయ్యారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, ఆలయ చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ, సభ్యులు సానబోయిన వెంకటేశ్వరరావు, రాపాక సుందర్‌కుమార్, కొల్లా రామకృష్ణ, పిల్లి వెంకట రమణ, తణుకు భాస్కరి, సానబోయిన మంగతాయారు, నరసింహాచార్యులు చర్చించారు.

కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం



చినతాడేపల్లి గ్రామ సచివాలయంలో కుష్టు వ్యాధి నివారణకు ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం



కుష్టు వ్యాధి నివారణనకు ప్రతిజ్ఞ చేస్తున్న వార్డు సెక్రటరీలు, వార్డు ఇన్‌చార్జి వట్టి బుజ్జి

తాడేపల్లిగూడెం రూరల్: కుష్టు వ్యాధి రహిత సమాజ నిర్మాణానికి అందరం కృషి చేద్దామని చిన తాడేపల్లి సర్పంచ్ పిచ్చుకల రాజారావు అన్నారు. జాతిపిత మహాత్మాగాంధీజీ వర్ధంతి సందర్భంగా సోమవారం మండలంలోని చినతాడేపల్లి గ్రామంలో కుష్టు వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ రాజారావు మాట్లాడుతూ స్పర్శలేని లేత రాగి రంగు మచ్చలు చర్మంపై ఉంటే అనుమానిత కుష్టుగా భావించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించడం మంచిదన్నారు. ఇంటింటికి ఆరోగ్య సర్వేకు వచ్చే ఆరోగ్య సిబ్బందికి అనుమానిత లక్షణాలుంటే తెలియజేయాలన్నారు. మందులు వాడటం ద్వారా కుష్టు వ్యాధిని నయం చేయవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ చిట్టూరి కాశీవిశ్వనాథం, సచివాలయ కార్యదర్శి రమేష్, క్లస్టర్ ఎంపీహెచ్‌ఏ రామకృష్ణ, ఎంఎల్‌హెచ్‌పీ దివ్య, ఏఎన్ఎం ఆదిలక్ష్మి, సచివాలయ సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ)లో : అజాద్ కా అమృత మహోత్సవాలు సందర్భంగా పట్టణంలోని హౌసింగ్‌బోర్డు కాలనీలోని 33, 34, 35 వార్డుల పరిధిలో సోమవారం వార్డు సచివాలయం వద్ద గాంధీ వర్ధంతి సందర్భంగా మథర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. కుష్టు వ్యాధి నిర్మూలన కార్యక్రమం నిర్వహించి, నిర్మూలనకు ప్రజలలో అవగాహన కల్పిస్తామని ఈ సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి వట్టి బుజ్జి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యుల ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు



సాయం అందజేస్తున్న ఆర్యవైశ్య సభ్యులు దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): గాంధీ వర్ధంతి సందర్భంగా ఆర్యవైశ్య సంఘం, వాసవి క్లబ్, వనిత క్లబ్ వారిచే వివిధ సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. పట్టణంలో ఆర్యవైశ్యులు ఆధ్వర్యంలో సోమవారం గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించిన అనంతరం పేద యువతి వివాహం నిమిత్తం రూ. 16,850 నగదును అందజేశారు. అదే విధంగా దివ్యాంగులు టీ స్టాల్ వ్యాపారం నిమిత్తం రూ .3000 వేలు విలువైన అవసరమైన వస్తువులు అందజేశారు. ఇద్దరు దివ్యాంగులకు రూ 1,000 విలువైన పౌష్టికాహారం అందించారు. ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు మండవల్లి చెన్న నాగేంద్ర, కోశాధికారి ఎన్‌బీటీ సుందరరావు, వాసవి క్లబ్ అధ్యక్షుడు చీమకుర్తి రాజా, పసుమర్తి అనిల్, పులవర్తి రాంపండు, కొర్లేపర రాము, మానేపల్లి సుబ్రహ్మణ్యం, శివ, మణికంఠ, ఏకాంబ్రేశ్వరరావు, లక్ష్మి, స్వర్ణ, నాగలక్ష్మి, గుప్తా, వెంకట్రామయ్య, సభ్యులు పాల్గొన్నారు.

వ్యక్తికి గాయాలు

భీమవరం అర్బన్ : ద్విచక్ర వాహనం ఢీకొని ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. భీమవరం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నరసింహపురం గ్రామంలో నన్నేటి ఇశ్రాయేలు ఒక ప్రైవేటు ద్విచక్ర వాహనం షాపులో వాచ్‌మెన్‌గా పనిచేస్తుంటాడు. సోమవారం ఉదయం ఇశ్రాయేలు రోడ్డు దాటుతుండగా ద్విచక్రవాహనం బలంగా ఢీకొట్టడంతో గాయాలయ్యాయి. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

గాంధేయ మార్గం అనుసరణీయం



మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో గాంధీజీ చిత్రపటానికి నివాళ్లులర్పిస్తున్న వాకర్స్ సభ్యులు



తణుకులో గాంధీజీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న సుబ్బారావు తదితరులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): మహాత్మగాంధీ వర్ధంతి సందర్భంగా సోమవారం స్థానిక గాంధీ మండపం వద్ద అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. వక్తలు మాట్లాడుతూ అహింస మార్గంలో దేశానికి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన మహనీయుడు అని కొనియాడారు. గాంధీ జీవిత విశేషాలను వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి కమిటీ సభ్యులు దుర్గా రామచంద్రరావు, ఆరాద్యుల రాము, పటాన్‌వల్లి, కత్తిముక్కల వెంకటేశ్వరరావు, కళ్యాణం రామచంద్రరావు, దాట్ల జగన్నాధరాజు, వాలి వీర వెంకట సత్యనారాయణ, మల్లుల విజయ్, పాలూరి లక్ష్మణరావు, తనగాల విలియమ్ కేరి, రావూరి రంగారావు, యడ్లపల్లి సూర్యనారాయణ, కన్నాజీ బాలకృష్ణ, నాగమునేశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో...
మహిళా వాకర్స్ ఆధ్వర్యంలో గాంధీ వర్ధంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షురాలు వనచర్ల విజయలక్ష్మి, కనకదుర్గ, మేరీ వజ్రమ్మ, రామలక్ష్మి, ఇందిరా కుమారి, పద్మావతి, మహాలక్ష్మి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ ఆధ్వర్యంలో....
వాకర్స్ భవనం వద్ద అసోసియేషన్ అధ్యక్షుడు కేవీ చలం ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లుర్పించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి పి.కుమారస్వామి, కోశాధికారి పీవీ పరమాత్మ, ప్రవా శ్రీనివాస్, కప్పల నరసింహమూర్తి, వనచర్ల నాగేంద్ర ప్రసాద్, వీరబ్రహ్మం, రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.



గాంధీ మండపం వద్ద గాంధీ విగ్రహానికి పూల మాల వేసి నివాళ్లుర్పిస్తున్న గాంధీ మండపం అభివృద్ధి కమిటీ సభ్యులు

గాంధీజీని ఆదర్శంగా తీసుకోవాలి...
తణుకు అర్బన్: మహాత్మా గాంధీజీని ఆదర్శంగా తీసుకుని యువత ఉన్నత శిఖరాలు అధిరోహించాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు అన్నారు. మహాత్మాగాంధీజీ వర్ధంతి సందర్భంగా తణుకు రాష్ట్రపతి రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ అహింసావాదంతో గాంధీజీ స్ఫూర్తిదాయకమైన పోరాటం చేసి స్వాతంత్ర్యాన్ని సాధించిపెట్టారని కొనియాడారు. అదే స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ స్వరాజ్యం దిశగా సచివాలయ వ్యవస్థ తీసుకువచ్చారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మెహర్ అన్సారీ, తణుకు మండల ఎస్సీసెల్ అధ్యక్షులు జంగం ఆనంద్‌కుమార్, సుద్దులపాండు, నత్తా కృష్ణవేణి, తాటిపర్తి శ్రీనివాసు, జల్లూరి జగదీష్, కొమ్మోజు రామకృష్ణ, సామంతుల అప్పారావు పాల్గొన్నారు.



అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఎంపీపీ

మండల పరిషత్ కార్యాలయంలో గాంధీవర్ధంతి
అత్తిలి: జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతిని సోమవారం అత్తిలి మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఎంపీపీ మక్కా సూర్యనారాయణ, ఎంపీడీవో వీవీవీఎస్ రామారావులు గాంధీ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళ్లులర్పించారు. ఈసందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించిన మహాత్మాగాంధీ అడుగుజాడల్లో నడుస్తూ, ఆయన ఆశయాలను మనమంతా స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

భీమవరం (ప్రకాశం చౌక్) : శ్రీమావుళ్లమ్మ అమ్మవారి 59వ వార్షికోత్సవాల్లో భాగంగా సోమవారం సాయంత్రం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. సాయంత్రం 5గంటలకు భారతీయ రాఘవ నృత్య కేంద్రం భీమవరం వారిచే కూచిపూడి జానపద నృత్యాలు, రాత్రి 7.30 గంటలకు పులగం శివనాగ నర్సింహరావు అనాకోడేరు వారిచే దుర్యోధన ఏకపాత్ర, రాత్రి 8 గంటలకు శ్రీమావుళ్లమ్మ నాట్యమండలి భీమవరం వారిచే బాల నాగమ్మ నాటకం ప్రదర్శించారు. నీరుల్లి కూరగాయ పండ్ల వర్తక సంఘం, అమ్మవారి ఉత్సవ కమిటీ సభ్యులు, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారి ఉత్సవాల్లో నేడు
శ్రీ మావుళ్లమ్మ అమ్మవారి 59వ వార్షిక ఉత్సవాల్లో మంగళవారం సాయంత్రం 5 గంటలకు కూచిపూడి నృత్యం, 6 గంటలకు హరికథ, రాత్రి 8 గంటలకు సినీ ఆర్కెస్ట్రా ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

పీఎల్ఐను సద్వినియోగం చేసుకోవాలి

పెంటపాడు: పోస్టల్ డిపార్ట్‌మెంట్ పరిధిలోని పురాతన జీవితబీమా పథకం అయిన పోస్టల్ లైఫ్ ఇన్సూరెన్స్ (పీఎల్ఐ) సౌకర్యాన్ని గ్రాడ్యుయేట్‌లు కూడా సద్వినియోగం చేసుకోవాలని పెంటపాడు పోస్టు మాస్టర్ ఎస్వీఆర్‌కే రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. తపాలబీమాలో తక్కువ ప్రీమియం, ఎక్కువ బోనస్ అందించే ఈ పథకం గతంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు మాత్రమే ఉండేదన్నారు. అయితే 1884 సంవత్సరం ఫిబ్రవరి 1న ప్రారంభించిన ఈ పథకం నేటికి 140 ఏళ్ల పూర్తయిన సందర్భంగా వారితోపాటు, కొన్ని షరతులపై ప్రైవేటు ఉద్యోగులకు, డిగ్రీ, డిప్లొమా, ఐటీఐ పూర్తి చేసిన విద్యార్థులకు కూడా ఈ పథకం వర్తించేలా కేంద్రం సవరించిందన్నారు. ఫిబ్రవరి 1 నుంచి ఈ పథకాన్ని సమీపంలోని పోస్టల్ కార్యాలయం వద్ద సంప్రదించి సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

తాడేపల్లిగూడెం (టీఓసీ)లో : పురాతన జీవిత బీమాగా పోస్టల్ లైఫ్ ఇన్స్యూరెన్స్ (పీఎల్ఐ) వివిధ రంగాల ఉద్యోగులు తీసుకొని లబ్ధిపొందే విధంగా తీర్చిదిద్దారని, ఎన్నో విధాలుగా లాభకరమైన పీఎల్ఐ 140వ వసంత వేడుకలు చేసుకుంటున్న సందర్భంగా ఫిబ్రవరి 1వ తేదీన పీఎల్ఐ డేగా ప్రకటించినట్లు తాడేపల్లిగూడెం డివిజన్ సూపరింటెండెంట్ ఆఫ్ పోస్టు ఆఫీసెస్ సీవీ రామిరెడ్డి వెల్లడించారు. పీఎల్ఐలో చేరే అవకాశం ప్రైవేట్ ఉద్యోగులకు కొని షరతుల మీద ఇవ్వడం జరుగుతుందని, గ్రాడ్యూట్, డిప్లమా, ఐటీఐ విద్యార్హత కలిగిన వారు పీఎల్ఐ తీసుకోవచ్చునని కోరారు.

తరటావలో జగనన్న భూహక్కు సర్వే

ఆకివీడు : జగనన్న సంపూర్ణ భూహక్కు సర్వే కార్యక్రమం మండలంలో వేగవంతంగా జరుగుతుందని తహసీల్దార్ ఎస్.వెంకటేశ్వరరావు చెప్పా రు. మండలంలోని అజ్జమూరు, మాదివాడ గ్రామాల్లో సర్వే పూర్తయ్యిందని, సోమవారం తరటావ గ్రామంలో సర్వే చేసినట్లు తెలిపారు. డ్రోన్ సహాయంతో సర్వే వేగవంతం చేశామన్నారు. భూమి యజమానులకు తమ భూమిని దస్తావేజుల ప్రకారం పూర్తిగా హద్దులు నిర్ణయించి, అప్పగిస్తామని చెప్పారు. సర్వే కార్యక్రమంలో సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన ఎంఎస్ఆర్.మూర్తి, కె.వరప్రసాద్, డ్రోన్ పైలెట్ జీ.శేషుకుమార్, సర్వేయర్లు ఎస్.ప్రవీణ్, రత్నవల్లి పాల్గొన్నారు.

ప్రభుత్వ విధానంతో రైతులకు మేలు



కంతేరు లో సీఎం చిత్ర పటానికి క్షీరాభిషేకం చేస్తున్నా రైతులు, నాయకులు



అత్తిలి మండలం కొమ్మరలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ఇరగవరంలో : ప్రభుత్వ విధానంతోనే రైతులకు మేలు జరిగి సకాలంలో రైతుల ఖాతాలో ధాన్యం డబ్బులు జమ అయ్యాయని కొత్తపాడు సొసైటి అధ్యక్షుడు పెన్మెత్స రామభద్ర రాజు అన్నారు. సోమవారం కొత్తపాడు, రేలంగి, తూర్పువిప్పర్రు, అయినపర్రు, కంతేరు గ్రామాలలో సొసైటిల వద్ద రైతులు, నాయకులు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేయడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో ఎన్నడు లేని విధంగా సీఎం జగన్ మోహన్ రెడ్డి రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేసి ధాన్యం నగదును వారి ఖాతాలకు నేరుగా జమ చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు కొప్పిశెట్టి దుర్గా ప్రసాద్, సొసైటి అధ్యక్షుడు రాంబాబు, సైపురెడ్డి పెద్దిరాజు, వైఎస్సార్ సీపీ రైతు నాయకులు, కర్రి వెంకట రెడ్డి,పులుపు అనిల్, యంపిటీసీ గుడిమెట్ల వీర్రెడ్డి. గుడిమెట్ల సత్యనారాయణ రెడ్డి, కె నరసింహ రామకృష్ణ రెడ్డి, నాగరాజు, పట్టాభి రామిరెడ్డి, గిరీష్ , కడలి శ్రీనివాస్, బొక్కా ఆంజనేయులు, దొంగ కోటయ్య, తోరం వెంకటేశ్వర్లు, కుక్కల ప్రకాష్, పాల్గొన్నారు.

అత్తిలి ఎడైతు భరోసా కేంద్రాల ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేసి, సకాలంలో ఖాతాలలో ధాన్యం డబ్బులు జమ చేయడం పట్ల రైతాంగం హర్షం వ్యక్తం చేస్తూ సీఎం జగన్మోహన్‌రెడ్డి, రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకటనాగేశ్వర రావు చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. సోమవారం అత్తిలి మండలం కొమ్మర గ్రామంలో రైతుల ఆధ్వర్యంలో ఈకార్యక్రమాన్ని జరిపారు. ఈసందర్భంగా రైతులు మాట్లాడుతూ పంట బాగా పండడంతోపాటు దళారీ వ్యవస్థ లేకుండా ఆర్‌బీకేల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యం తాలూకా డబ్బులు సకాలంలో తమ బ్యాంకు ఖాతాలకు జమచేసారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గుడిమెట్ల రామకృష్ణారెడ్డి, సత్తి గణేష్‌రెడ్డి, సత్తి సుబ్బిరెడ్డి, రైతులు పాల్గొన్నారు.